# వేధిస్తున్న వైద్యుల కొరత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రభుత్వ వైద్యసేవలు నిర్వీర్యమవుతున్నాయి. పీహెచ్‌సీలో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించడానికి సరైన డాక్టర్లు ఉండట్లేదు. ఉన్న అరకొర డాక్టర్లను ఉన్నతాధికారులు డిప్యుటేషన్‌పై పంపుతున్నారు. దీంతో సత్యవేడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి 50 పడకల కమ్యూనిటీ వైద్యశాలలో 12 మంది డాక్టర్లకు గానూ ఆరుగురు డాక్టర్లు మాత్రమే ఉండడంతో మహిళలు, గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం అవస్థలు పడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో మెరుగైన వైద్యసేవల కోసం దూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

- సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్ల కొరత
- ఉన్నవారినీ డిప్యుటేషన్‌పై పంపిన ఉన్నతాధికారులు
- సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న పల్లెజనం
- మరోవైపు తరుముకొస్తున్న కరోనా
- కూటమి పాలనలో ప్రభుత్వ వైద్య సేవలు నిర్వీర్యం


వైద్యం కోసం వేచి ఉన్న గర్భిణులు

సత్యవేడు: స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్ వైద్యాధికారిగా ఉన్నారు. కంటి డాక్టరే జనరల్ వైద్యసేవలందిస్తున్నారు. ఫార్మసిస్టు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ నోచుకోలేదు. వైద్యశాలలో మెరుగైన వైద్యం అందలేదన్న విమర్శలు నెలకొంటోంది.

**భర్తీ కాని పోస్టులు..**

అనస్థీషియా, జనరల్ మెడిసిన్, గైనకాలజిస్టు(1), జనరల్ డాక్టర్, జనరల్ ఫిజీషియన్, పీడియాట్రీషన్, చిల్డ్రన్ స్పెషలిస్టు భర్తీ కావాల్సి ఉంది.

**హౌస్ సర్జన్లతో కొంత ఊరట**

తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి హౌస్ సర్జన్లు సత్యవేడు వైద్యశాలకు అప్పుడప్పుడు ముగ్గురు లేక నలుగురు వస్తున్నారు. వారంలో మూడు రోజులు ఉంటున్నారు. హౌస్‌సర్జన్లు వారం పాటు పూర్తిగా ఉండి మెరుగైన వైద్యం అందించాలని వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు.

| డాక్టర్లు | ఉండాల్సిన సిబ్బంది | ప్రస్తుతం ఉన్న సిబ్బంది | ఖాళీలు |
|---|---|---|---|
| డాక్టర్లు | 12 | 6 | 6 |
| గైనకాలజిస్టు | 2 | 1 | 1 |
| ఫార్మాసిస్టు | 2 | 1 | 1 |
| జూనియర్ అసిస్టెంట్ | 1 | 1 | 1 |

## వేతనం ఇక్కడ.. విధులు మరో చోట..

ఇక్కడ పనిచేస్తున్న ఈఎన్‌టీ డాక్టర్ సొహైల్ తిరుపతి రుయాకు, అలాగే డాక్టర్ మానస నగరి ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. అలాగే నియోజకవర్గంలోని బుచ్చినాయుడుకండ్రిగ పీహెచ్‌సీలో డాక్టర్ విద్యాసాగర్ సైతం డిప్యుటేషన్‌పై వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆప్తమాల్టిక్ అసిస్టెంట్ శోభారాణి మూడేళ్ల కిందట పీలేరుకు వెళ్లి అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వేతనం మాత్రం ఇక్కడే తీసుకుంటున్నారు.


సత్యవేడు సీహెచ్‌సీ వైద్యశాల భవనం

**గర్భిణులకు పరీక్షలు చేయిస్తున్నాం..**

డాక్టర్ల కొరత ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం సత్యవేడు వైద్యశాలకు మహిళా గైనకాలజిస్టు పోస్టు భర్తీ అయింది. ప్రస్తుతం నాతో పాటే ఉన్న డాక్టర్లు, హౌస్ సర్జన్లు వైద్యసేవలందిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలకు మావంతు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ హరిప్రసాద్, కమ్యూనిటీ వైద్యశాల సత్యవేడు

**డిప్యూటేషన్లు రద్దు చేస్తాం..**

సత్యవేడు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వైద్యులను వెనక్కి రప్పిస్తాం. సీహెచ్‌సీ వైద్యశాలలో పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తాం. గైనకాలజిస్టుగా మహిళా డాక్టర్‌ను నియమించాం.

– ఆనందమూర్తి, డీసీహెచ్‌ఎస్, తిరుపతి.

## ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న వైద్యాధికారి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, తిరుపతి జిల్లాలో మొదటి కేసు నమోదు అయిందని వైద్యాధికారి మాధవి తెలిపారు. ఆమె గురువారం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించి, మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా జలుబు, జ్వరం, దగ్గు, వాసన, రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు ఉంటే గుర్తించి, కోవిడ్ టెస్టు చేసి నిర్ధారణ అయితే వారికి వైద్యసేవలు అందిస్తామన్నారు. మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. గ్రామాల్లో ప్రజలు గుంపులుగా ఉండకుండా, భౌతికదూరం పాటించడంతో పాటు శానిటైజర్ వాడాలని, మాస్కులు ధరించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

### క్లుప్తంగా

## భూమిని ఆక్రమించారని నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు దళితవాడ నుంచి గ్రామానికి వెళ్లే వీధికి సంబంధించిన భూమిని ఆక్రమించారని దళితులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడ నుంచి గ్రామానికి వెళ్లే వీధికి ఇరువైపులా ఉన్న ఖాళీ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి వారి పొలాల్లో కలుపుకున్నారని ఆరోపించారు. దీంతో పంటకాలువ కూడా ఆక్రమణకు గురైందన్నారు. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయాలని తహసీల్దారు శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ సర్వే చేసి, ఆక్రమణకు గురైన భూమి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

## వారపు సంత వేలంతో ఆదాయం


పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం గ్రామం మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ పంచాయతీకి ఆదాయం వారపు సంతను సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారపు సంతవేలం ద్వారా సంవత్సరానికి రూ.1,39 లక్షలు గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరిందన్నారు. 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2026 మార్చి వరకు వారపు సంత నిర్వహణకు వేలం నిర్వహించామని ఆయన తెలిపారు.

## శిక్షణ వాయిదా వేయాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: ఎస్‌సీఆర్‌టీ వారు చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం వారు ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్‌సీఆర్‌టీ వారు ఈ నెల 9, 10, 11వ తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారన్నారు. అయితే స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయి ఆ ప్రాంతాల్లో కుటుంబాన్ని తీసుకెళ్లడం, సామాన్లు సర్దుకోవడం తదితర పనుల్లో ఉన్నారన్నారు. దీంతో శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, గోపాల్, జయకర్, కుమార్, ఈశ్వరయ్య, రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

రేణిగుంట: పట్టణంలోని ఆర్సీఎం హైస్కూల్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌లోని కిట్స్, క్వాలిటీ వాల్ గురువారం రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు అనురాధ పరిశీలించారు. సీఎంఓ సురేష్, ఎంఈఓ రంగనాథయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం


ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

రేణిగుంట: పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం గ్రంథాలయం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బహుమతులు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. దేశభక్తి గీతాలాపన, డ్రాయింగ్, పద్యం భావం, కథల చెప్పడం, వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శ్రీముఖి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్ప స్వామి, త్యాగరాజు, ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

## మాకు అండగా నిలవండి

శ్రీకాళహస్తి: న్యాయం కోసం పోరాడుతున్న తమకు అండగా నిలవాలని శ్రీకాళ హస్తీశ్వరాలయ ఉచితసేవకులు గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్యకు విన్నవించారు. 2014 నుంచి ఉచిత సేవకులుగా పనిచేస్తున్న 12 మందికి వేతనాలు ఇవ్వకుండా ఆలయాధికారులు అన్యాయం చేస్తున్నారని వారు వాపోయారు. పుల్లయ్య స్పందిస్తూ కార్మికులు, పీడితుల పక్షాన సీఐటీయూ అండగా ఉండి, పోరాడుతుందని హామీ ఇచ్చారు.

# పర్యావరణ రక్షణ మన బాధ్యత


సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న కోర్టు జడ్జి వెంకటనాగరాజు

సత్యవేడు: జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని సత్యవేడు కోర్టు జడ్జి ఏ.వెంకటనాగరాజు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించగలుగుతామన్నారు. అడవులు, జలవనరులు క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ రకంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణం అవుతోందన్నారు. మనవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని కాపాడి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు రోడ్ల వెంబడి, పాఠశాలలు, ఆటస్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ తరుణాక్షరెడ్డి, తహసీల్దారు రాజశేఖర్, ఏఈ ఇబ్రహీంఖాన్, ఏఓ త్రివిక్రమరావు, ఎంఈఓ రవి, ఏపీఓ విజయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళాపోలీసులు తదితరులు పాల్గొన్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజి నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేయాలన్నారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె కార్యాలయ ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ వెంకటరత్నమ్మ కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల ఆవరణలో, అలాగే పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రమణమ్మ మొక్కలు నాటారు. మొత్తం 1200 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, మధునాయుడు, పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ బాలాజీ నాయక్


బుచ్చినాయుడుకండ్రిగలో మొక్కలను నాటుతున్న తహసీల్దార్ శ్రీదేవి

## బాలకార్మిక నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

రేణిగుంట: బాల కార్మికుల నిర్మూలనకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్‌లో భాగంగా రేణిగుంటలో గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రగతి స్వచ్ఛంద సేవ సంస్థ, కార్మిక శాఖ, చైల్డ్ లైన్ డిపార్ట్‌మెంట్, పోలీసులు కలసి పట్టణంలోని వివిధ దుకాణాలను పరిశీలించారు. ఇద్దరు బాల కార్మికులను గుర్తించి వివరాలను సేకరించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ రాష్ట్రం చేపట్టిన చైల్డ్ లేబర్ రెస్క్యూ ఆపరేషన్ కార్యక్రమంతో ఎంతోమందిని బాల కార్మికులకు విముక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఓంకార్ రావ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ చిన్న లాలెప్ప, కార్మిక శాఖ అధికారులు రంగనాథ్, ప్రవీణ్ కుమార్, హేమాచారి, ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, జయలక్ష్మి పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వివిధ శాఖ అధికారులు

## ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం


శిబిచక్రవర్తిని సత్కరిస్తున్న సమన్వయకర్త రాజేష్, నాయకులు

వరదయ్యపాళెం: అధికార కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో యువత ముందుండాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సూచించారు. వరదయ్యపాళెం మండలం మత్తేరిమిట్ట గ్రామానికి చెందిన శిబిచక్రవర్తి రాష్ట్ర యూత్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమన్వయకర్త రాజేష్‌తో కలసి తన నియామకానికి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుడ్డు వేణు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, ఇతర నాయకులు ఉన్నారు.

# మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


చింతలపాళెంలో పర్యావరణ చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


వెదళ్ల చెరువులో మొక్క నాటుతున్న ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఏర్పేడు: విరివిగా మొక్కలను పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏర్పేడులో మొక్కలు నాటారు. ఎంపీడీఓ సౌభాగ్యం, ఈఓపీఆర్‌డీ రమణకుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీమతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని చింతలపాళెంలో ప్రగతి సంస్థ, క్రై సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటారు. చిన్నారులతో పర్యావరణ హితాన్ని తెలిపే బొమ్మలు గీయించారు. సర్పంచ్ చింత బాలప్రసాద్‌యాదవ్, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీషా, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజూష, వెంకటేష్, మురగయ్య పాల్గొన్నారు.

**ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

రేణిగుంట: మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెదళ్ల చెరువు గ్రామంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కేవీ రమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మల్లవరంలో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి రవిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటి గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం ఆవరణలో వార్డు సభ్యుడు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యాధికారులు మొక్కలు నాటారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలులో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

**మొక్కల పెంపకం బాధ్యతగా భావించాలి**

అందరూ మొక్కల పెంపకం బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రేణిగుంట ఓల్డ్ చెక్ పోస్ట్ కూడలిలో గురువారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం తుడా వైస్ చైర్మన్ మౌర్య అందరితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆరీ ఏబీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు పెంపకం ఆవశ్యకం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగరాజు, మహేష్, పట్టాభిరెడ్డి, రాధాకృష్ణయ్య, సిఆర్‌ఎంటి లు ముని మోహన్, ధనశంకరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు పట్టణంలోని గోపాలవనం ప్రాంతంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సీవీ దిలీప్, ఎస్సీవీ కిరణ్, గోగినేని భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


ఏర్పేడులో మొక్కలు నాటుతున్న సర్పంచ్ నల్లపాళెం శివయ్య


మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య


మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

## వ్యక్తికి రిమాండ్

నాగలాపురం: భూతగాదా విషయంలో మహిళ ను అవమానించిన కేసులో వ్యక్తిని రిమాండ్‌కు త రలించినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కడివేడుకు చెందిన జయంతికి చెందిన పొలాన్ని మార్చి 28వ తేదీన అదే గ్రామానికి చెందిన మాజీ క్షేత్ర సహాయకుడు మహేష్(35) చదును చేయసాగాడు. ఈ విషయమై జయంతి అతడిని ప్రశ్నించగా.. ఆమెను కొట్టి నలుగురిలో మహేష్ అవమానపరిచాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని సత్యవేడులో కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

## అలరించిన హరికథా గానం

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో ఉన్న శ్రీకృష్ణ దాపదీదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం హరి కథాగానం భక్తులను అలరించింది. భాగవతారిణి షణ్ముఖి ఈ సందర్భంగా అరణ్యపర్వం అర్జునుడి తీర్థయాత్ర, అర్జునుడు ఆవుల తోలుట తదితర ఘట్టాలను గానం చేశారు. అనంతరం శ్రీకృష్ణ ద్రౌపదీ ధర్మరాజులస్వామి ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగించారు.

**నేడు అర్జున తపస్సు**

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సుమాను కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం వైభవంగా జరగనుంది. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెంబేటి ముని రత్నం రెడ్డి, ఆలయ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి, దొరస్వామి, బాలాజీ, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.